క్లుప్తంగా

నియామకం

గంగాధరనెల్లూరు: ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆంధ్ర రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ విజయకుమార్ నియమితులైనట్లు ఆ సంస్థ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ శ్యామ్యూల్, రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సంఘం నాయకులు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలోని వృద్ధులకు అంబేద్కర్ రాష్ట్ర యువజన సంఘం నాయకులు శనివారం అన్నదానం చేశారు. నాయకులు రాజ్‌కుమార్, చార్లెస్, గణేష్, అనిల్, నవీన్ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవ మంగళం పంచాయతీ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీశనీశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రుషికేష్ స్వామివారికి తైలాభిషేకం చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పలురకాల పూలతో అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆలయంలో రద్దీ ఏర్పడింది. నిర్వాహకులు ఆలయం ఎదుట శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించండి!



విలేకరులతో మాట్లాడుతున్న ప్రేమ జంట

చిత్తూరు రూరల్: ''మేం ఇద్దరం మేజర్లం...ప్రేమించి పెళ్లి చేసుకున్నాం..మా పెద్దల నుంచి ప్రాణహాని ఉందని మాకు రక్షణ కల్పించండి.'' అంటూ ఓ ప్రేమ జంట శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించింది. నగరంలోని గురప్పనాయుడువీధికి చెందిన జాహ్నవి (19) ఇంటర్ వరకు చదువుకోగా, ఎం.ఎం కోవిల్ స్ట్రీట్‌కు చెందిన భానుచందర్ (23) డిగ్రీ పూర్తి చేశాడు. ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరిదీ ఒకే కులమైనప్పటికీ ఇరు కుటుంబాల పెద్దలు వీరి పెళ్లికి అంగీకరించలేదు. ఈ క్రమంలో ఇద్దరు ఇంట్లోంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని మీడియాను ఆశ్రయించారు. ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తిరుమల క్షేత్రపాలకుడికి అభిషేకం

తిరుమల : తిరుమల గోగర్భం సమీపంలోని రుద్ర రూపమైన క్షేత్రపాలకుడికి శనివారం వేడుకగా అభిషేకం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఏటా రుద్రునికి అభిషేకం జరిపించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

కారును ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

చంద్రగిరి: కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. పాండిచ్చేరికి చెందిన భక్తులు తిరుమల శ్రీవారిని దర్శనానికి కారులో శుక్రవారం అర్ధరాత్రిలో బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున పనపాకం వద్ద తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారు రోడ్డుకు అడ్డంగా పడింది. వెనుక వస్తున్న మరో కర్ణాటక ఆర్టీసీ బస్సు బోల్తా పడిన కారును ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్(43) అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న రాజన్, పెరుమాళ్, సంజిత, విజయ్‌శేఖర్ గాయపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

హరహర శంభో

హరహర శంభో శంకరా నామస్మరణతో శైవ క్షేత్రాలు మారోమ్రగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నగరి, జీడీ నెల్లూరు నియోజకవర్గం వ్యాప్తంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివపార్వతుల దర్శనం కోసం పెద్ద సంఖ్యలో క్యూకట్టారు. భక్తులతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.



కీళపట్టులో గజసంహారమూర్తి



నగరి: నందివాహన సేవలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి



రామసముద్రంలో శివునికి హారతి



నగరి: కీళపట్టులో ధ్యాన శివుని దర్శనానికి వెళుతున్న భక్తులు



నగరి: చంద్రమౌళేశ్వర ఆలయంలో అన్నదానం



నగరి: హనుమతేశ్వరుని సేవలో భక్తులు

నగరి: మండలంలోని ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక కరకంతేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఆర్కేరోజా బహూకరించిన నందివాహనంపై కామాక్షీసమేత కరకంతేశ్వర స్వామిని ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు. మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కీళపట్టు త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాకారంలో 30 అడుగుల పొడవుతో నిర్మించిన ధ్యానశివుడు, 9 అడుగుల ఎత్తుతో తయారుచేసిన గజసంహారమూర్తిని, చందనాలంకారంలోని నందీశ్వరున్ని భక్తులు దర్శించుకున్నారు. రామ్‌ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర రెడ్డి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, సురేష్, నరేష్, ఆరుముగం, మోహన్, యోవాన్, వజ్రవేలు, కాశి పాల్గొన్నారు. అన్నదానం చేశారు. గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర క్షేత్రంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పుండరీక వరదానందస్వామి, వెంకటాచలపతి రాజు, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి, ఉమాపతిరాజు, అన్నదాన నిర్వాహకులు భాస్కర్‌రాజు, జయచంద్రారెడ్డి, చిన్నబ్బరాజు పాల్గొన్నారు. అలాగే బుగ్గ అగ్రహారంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆర్బీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ డిల్లిబాబు, సర్పంచ్ రవికుమార్ పాల్గొన్నారు. ముడిపల్లి నామతీర్థం కొండపైనున్న నాగలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని శివాలయం, కావునూరు, అత్తూరు, చవరంబాకం గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మిట్టకండ్రిగ గ్రామంలోని సోమేశ్వరి సమేత సోమనాథస్వామి ఆలయంలో మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని రామసముద్రం గ్రామంలో వెలసిన గంగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి వేకువజామున ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేశారు. స్వామిపై జలధార పడుతుండగా కర్పూర హారతులిచ్చారు. ఆలయ అర్చకుడు రమేష్ పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలాపన

శ్రీరంగరాజపురం: మండలంలోని పల్లేరుకాయల కోనలో వెలసిన ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, అలంకరణ తర్వాత భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి వీధి నాటకం, భక్తి గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. ధర్మకర్త మోహన్ నాయుడు, సర్పంచ్ హరిత, అర్చకులు శేఖర్ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాలసముద్రం

పాలసముద్రం: మండలంలోని గంగమాంబాపురం శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు రుద్రాక్ష, శివలింగాలను ఉచితంగా అందించారు. శ్రీకావేరిరాజుపురం పాల కొండపై వెలసిన శివలింగానికి అభిషేకాలు చేశారు. నొచ్చిలిలోని గిరిరాజా కన్యకాపరమేశ్వరి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు.

గంగాధరనెల్లూరు

గంగాధరనెల్లూరు: స్థానిక గంగాధరేశ్వరస్వామి ఆలయం, ఎస్ఎస్ కొండలోని శ్రీసిద్ధేశ్వరస్వామి, కొత్రకోన శ్రీమల్లేశ్వరస్వామి, మహదేవమంగళం

సదాశివకోనలో లింగోద్భవ అభిషేకం

వడమాలపేట: సదాశివకోనలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఓబీర్ కండ్రిగలోని ఉమామహేశ్వర ఆలయం, వడమాలపేట, అప్పలాయగుంటలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వడమాలపేట బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్వీపురం టోల్ గేటు వద్ద అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సదాశివకోన చైర్మన్ జయచంద్రన్, సభ్యులు దిలీప్, మునస్వామి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి విశేష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రి సమీపంలోని అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి, చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి, బలిజ మొండివెంగనపల్లెలోని సిద్దేశ్వరస్వామి, ముతాలం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి, తిరుమలయ్యపల్లె శివాలయాల్లో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పవిత్ర స్నానమాచరించి శివపార్వతులను దర్శించుకుని పునీతులయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు.



పట్టువస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చవటగుంటలోని నందీశ్వరస్వామి ఆలయాన్ని సందరర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కుమార్తె కృపాలక్ష్మి అరుణగిరిపై కొలువైన కొండమల్లీశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి స్వామి వారికి పూజలు చేశారు. పంచముఖ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీలు నాగరాణి, లత, జెడ్పీటీసీ సుకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి గోవర్ధన్ రెడ్డి, పద్మనాభరెడ్డి, బట్టి సుబ్రమణ్యం, ధనంజయరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.



వడమాలపేట: విద్యుత్ దీపాల అలంకరణలో సదాశివకోన



వెదురుకుప్పం: కొండమల్లీశ్వరస్వామి



కొండమల్లీశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కృపాలక్ష్మి



ఎస్ఆర్‌పురం: స్వామి సేవలో భక్తులు, పాలసముద్రం: నొచ్చిలి శివాలయంలో.., గంగమాంబాపురంలో..

ఆదిదంపతులకు పట్టువస్త్రాల సమర్పణ



మూలకోనలో స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి



గూళూరు చెరువులోని ఈశ్వరునికి జలహారతి



భక్తులతో కిటకిటలాడిన పుత్తూరు ఈశ్వరాలయం

పుత్తూరు రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని గోపాలకృష్ణాపురం పంచాయతీ మూలకోనలోని పార్వతీ సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివపార్వతులకు పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. నాగిలేరు వద్దనున్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ గూళూరు చెరువులోని గాలిగోపురంపైనున్న శివమూర్తికి కర్పూర హారతులిచ్చారు. తొరూరు గ్రామంలోని కామాక్షీ సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్‌టెక్ పరిశ్రమలో వ్యక్తి అనుమానాస్పద మృతి

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని కోనేటిరాజుపాళెం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న విభూది మహేష్‌బాబు(28) అనుమానాస్పదంగా మృతి చెందాడు. దొరవారి సత్రం మండలం, నెల్లబల్లి గ్రామానికి చెందిన విభూది మహేష్‌బాబు గ్రీన్‌టెక్ పరిశ్రమలో మిషనరీ సెక్షన్‌లో అపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం యథావిధిగా వీధులకు వెళ్లగా.. ఆ తర్వాత ఫిట్స్ వచ్చిపడిపోవడంతో మహేష్‌బాబు తమ్ముడు సాయితేజ్ హుటాహుటిన నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మహేష్‌బాబు మృతిచెందాడు. మృతిపై అనుమానం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

జాతీయస్థాయి వ్యాసరచన పోటీ ఫలితాలు విడుదల

పలమనేరు: పలమనేరు పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జాతీయస్థాయిలో మాతృభాషపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల ఫలితాలను ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన సాయి హర్షిత, అభిషేక్, సంకీర్త్, అక్షిత్, చౌడేపల్లికి చెందిన వర్షిణి, ముషీరాబాద్‌కు చెందిన శ్రియాన్, రాజ్ దుహిత్‌రెడ్డి, పలమనేరుకు చెందిన రాజేష్, గగనదీపిక, అనంతపురం జిల్లా నార్పలకు చెందిన లక్ష్మీరాయ్, గంగవరానికి చెందిన మధురాక్షి, సాజియా, రాజేష్, సంగారెడ్డికి చెందిన దీక్షిత్, మణికొండకు చెందిన శ్రీనివాస్, కూర్మాయికి చెందిన రమ్యశ్రీ, చింతమాకులపల్లికి చెందిన డింపుల్, పుదిపట్లకు చెందిన ధనుంజయ విజేతలుగా నిలిచినట్టు అందులో పేర్కొన్నారు. వీరికి ఈనెల 21న పలమనేరులో జరిగే మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేయనున్నట్టు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద పేకాట ఆడుతున్నట్లు సీఐ నరసింహరాజుకు సమాచారం అందింది. శనివారం మధ్యాహ్నం సీఐ ఆదేశాలతో ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండు వద్ద దాడులు చేశారు. ఇక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, రూ.18,690 నగదును సీజ్ చేశారు. జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వైభవం.. శివపార్వతుల కల్యాణం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని స్కంధపుష్కరిణి వద్ద వెలసిన శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం చేశారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే సుద్దగుంటలోని సదాశివేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వర ఆలయం, ఉమామహేశ్వర స్వామి, పాదిరికుప్పంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



కార్వేటినగరం: అలంకరణలో సంగమేశ్వరస్వామి

దుమ్మురేపిన జల్లికట్టు

వెదురుకుప్పం: ఉరకలెత్తుతున్న కోడెగిత్తలు.. వాటిని నిలువరించేందుకు పోటీపడిన యువత.. ప్రేక్షకుల హర్షధ్వానాల నడుమ జల్లికట్టు దుమ్మురేపింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామంలో ఎడ్లపందేలు జరిగాయి. జనప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోతున్న ఎడ్లను నిలువరించేందుకు యువత సాహసం చేయగా, ప్రేక్షకుల అరుపులు, కేకలతో జల్లికట్టు హోరెత్తింది. ఎడ్ల కొమ్ములకు పలకలు కట్టి పందేనికి సిద్ధం చేయగా, అప్పటికే యువత పెద్దఎత్తున అల్లి వద్ద నిలబడ్డారు. ఈక్రమంలో ఎడ్లను దశల వారీగా పందేనికి ఉసిగొల్పారు. దూసుకుపోతున్న ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత గట్టిగానే పోరాడారు. యువకులు కొన్ని ఎడ్ల వేగాన్ని నిలువరించి పలకలను లాక్కొని ఆనందంలో మునిగితేలారు. కొంత మంది యువకులు మాత్రం పశువుల దూకుడును కట్టడి చేయలేక నిరుత్సాహపడ్డారు.



దూసుకుపోతున్న కోడెగిత్తలు



ఎద్దను నిలువరిస్తున్న యువకులు